క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు



వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేష పూజలు జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

ఘనంగా పైడితల్లమ్మ పండగ



వడ్డన చేస్తున్న శానాపతి శంకర్రావు

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ సమీపంలోని గిరిప్రసాద్‌నగర్‌లో కొలువైన పైడితల్లమ్మ వార్షిక పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్నసమారాధనను స్థానిక టీడీపీ నేత శానాపతి శంకర్రావు ప్రారంభించారు. దాదాపు 2 వేల మంది అన్న ప్రసాదం స్వీకరించారు. అమ్మవారిని అర్జున్ చౌదరి, తైనాల మహేష్, అప్పారావు, కాలనీ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

రాయితీపై పంట నూర్పిడి యంత్రం



రైతుకు పంట నూర్పిడి యంత్రాన్ని అందిస్తున్న శశిధర్‌రెడ్డి

పరవాడ: ప్రభుత్వం రాయితీపై మంజూరు చేసిన పంట నూర్పిడి యంత్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని గుంటూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు ఆర్.శశిధర్‌రెడ్డి కోరారు. ఆహార భద్రత పథకంలో భాగంగా రావాడ గ్రామ రైతు కోన రామునాయుడుకు ప్రభుత్వం మంజూరు చేసిన పంట నూర్పిడి యంత్రాన్ని మంగళవారం ఆయన రైతుకు అందించారు. ఈ సందర్భంగా ఆయన పంట నూర్పిడి యంత్రం పనితీరును రైతులకు క్షుణ్ణంగా వివరించారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఈ యంత్రం వరి పంట సాగులో అనేక విధాల ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, వ్యవసాయ శాఖ అధికారులు బి.సురేష్‌కుమార్, ఆర్.గాయత్రి, పరవాడ వ్యవసాయాధికారి సీహెచ్ చంద్రావతి, గౌతమి, రైతులు పాల్గొన్నారు.

థాంగ్ టా పోటీల్లో ప్రతిభ



చాంపియన్‌షిప్ సాధించిన బాలభారతి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

పరవాడ: వాడచీపురుపల్లి కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి థాంగ్ టా పోటీల్లో దీపాంజలినగర్ బాలభారతి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ వసంతిదేవి తెలిపారు. థాంగ్ టా చాంపియన్‌షిప్ సాధించిన విజేతలకు పతకాలతో పాటు సర్టిఫికెట్లను అందించారు. పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో విజేతలను ప్రిన్సిపాల్‌తో పాటు, పాఠశాల పీటీ షెల్టన్ జాన్స్, సిబ్బంది అభినందించారు.

జీవకోటికి మనుగడకు ధరిత్రే ఆధారం

అగనంపూడి: ప్రాణికోటి మనుగడకు భూమాతే ఆధారమని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మానవాళిపై ఉందని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ అగనంపూడి (దివ్యజ్యోతి భవనం) ఇన్‌చార్జి బీకే రామకోటి అన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా మంగళవారం ఓంశాంతి ఆధ్వర్యంలో పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి, గాలి, ఆకాశం ప్రకృతిలో భాగమని, వాటిని కలుషితం చేయడం వల్ల జీవరాశులు అంతరించిపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. సాంకేతికను వినియోగించుకొని అభివృద్ధి చెందుతున్నామని విర్రవీగుతున్న మనిషి భూ తాపానికి కారణమవుతున్నాననే విషయాన్ని మర్చిపోతున్నాడని పేర్కొన్నారు. భూకంపాలు, హుద్ హుద్ వంటి ప్రకృతి విలయాలకు మనిషే కారణమనే విషయాన్ని మర్చిపోరాదన్నారు. పాఠశాల హెచ్‌ఎం కె.కొండబాబు, ప్రజా సంఘాల నాయకులు సత్యనారాయణ, అప్పారావు, హనుమంతురావు, అండిబోయిన మంగరాజు పాల్గొన్నారు.

బీసీ బాలికల అవస్థల గృహం

నాయుడుపాలెం శివారు మెట్టపాలెం(వాడచీపురుపల్లి వెస్ట్) బీసీ బాలికల వసతి గృహం మరమ్మతులతో మూల్గుతోంది. పెచ్చులూడుతున్న శ్లాబులు, రన్నింగ్ వాటర్ సౌకర్యం లేని మరుగుదొడ్లు, కేవలం వంట, భోజనాలకు తప్ప మరెందుకూ వినియోగించలేని పరిస్థితి. దీంతో సమీపంలోని ఎన్టీపీసీకి చెందిన ఓ భవనంలో వసతిగృహ విద్యార్థినులు తలదాచుకుంటున్నారు. అది కూడా ఒకే హాల్లో 57 మంది పిల్లలు సర్దుకుపోవాల్సిన దుస్థితి. నూతన భవనం నిర్మించి, వసతులు కల్పించాలని విద్యార్థినులు మొరపెట్టుకుంటున్నారు.



ఓ గదిలో పెచ్చులూడి పడుతున్న శ్లాబు



ఇనుప చువ్వలు దర్శనమిస్తున్న పిల్లర్లు

- శిథిలావస్థకు చేరిన వసతి గృహం
- సమీపంలోని ఒకే గదిలో 57 మంది బాలికలు
- కనీస వసతులూ కరవై.. విద్యార్థినుల ఇబ్బందులు



శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్న బాలికల వసతి గృహం

పరవాడ:

మండలంలోని నాయుడుపాలెం శివారు మెట్టపాలెం(వాడచీపురుపల్లి వెస్ట్)లో ఏర్పాటు చేసిన బీసీ బాలికల వసతి గృహ భవనం శిథిలావస్థకు చేరింది. ఏ క్షణం కూలిపోతుందో తెలియని దుస్థితి. ఇందులోనే 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 57 మంది విద్యార్థినులకు వసతి కల్పించారు. అయితే కొన్నేళ్లుగా ఈ భవనం పూర్తి స్థాయి మరమ్మతులకు గురవడంతో వసతి గృహాన్ని వదిలి పక్కనే ఎన్టీపీసీ ఏర్పాటు చేసిన మరో భవనంలో, అరకొర వసతుల మధ్యే బిక్కుబిక్కుమంటూ విద్యార్థినులు కాలం వెళ్లదీస్తున్నారు.

కనీస వసతులూ లేవాయే!

శిథిలావస్థకు చేరిన వసతిగృహంలో కేవలం వంటావార్పులు మాత్రమే చేస్తున్నారు. భవనం శ్లాబు, పిల్లర్లు పెచ్చులూడి, ఇనుప చువ్వలు దర్శనమిస్తున్నాయి. ఏమాత్రం వర్షం కురిసినా వంట గది కూడా కారిపోతుందని సిబ్బంది వాపోతున్నారు. వేరే ప్రత్యామ్నాయం లేకపోవడంతో పెచ్చులూడుతున్న భవనంలోనే భోజనాలు చేస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్, చేతి పంపు రిపేర్లకు గురైనా పట్టించుకున్న నాథుడు లేడు. వేసవిలో తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. మరుగు దొడ్లకు రన్నింగ్ వాటర్(పైపులైన్) సదుపాయం లేకపోవడంతో బకెట్లతో నీరు మోసుకెళ్లి కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు.

ఇరుకిరుకు గదిలో..

వసతి గృహ ప్రధాన భవనం పెచ్చులూడి భయంగొలిపేలా ఉండటంతో.. విద్యార్థినులకు ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులతో చేపట్టిన సమీపంలోని ఓ భవనంలో తాత్కాలిక వసతి కల్పించారు. ఇరుకుగా ఉన్న ఒకే ఒక్క గదిలోనే 57 మంది విద్యార్థినులు సర్దుకుపోవాల్సిన పరిస్థితి. రాత్రుళ్లు కాస్త ఎక్కువ సమయం చదువుకోవాలంటే వరండాకు మకాం మార్చాల్సిందే. విద్యార్థుల కోసం ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం రూ.లక్షలు వెచ్చించి పాత వసతి గృహంలో ఏర్పాటు చేసిన సోలార్ సిస్టం, ఇనుప బల్లలు తదితర సామగ్రి తుప్పు పట్టి మూలకు చేరాయి. దీంతో కొత్త భవనంలో నేల మీదే నిద్రించాలి. శిథిలావస్థకు చేరిన వసతిగృహ భవనాన్ని తొలగించి, నూతన భవనం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



మరమ్మతులతో మూలకు చేరిన ఆర్వో ప్లాంట్



పనిచేయని చేతి పంపు



ఈ గదిలోనే 57 మంది సర్దుకుపోతున్నారు..

భయంతో కాలం వెళ్లదీస్తున్నాం



పెచ్చులూడుతున్న వసతి గృహ భవనం ఏ క్షణాన కూలుతుందో తెలియని పరిస్థితి. దీంతో భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నాం. చాలా సార్లు భోజనం చేస్తున్నపుడు శ్లాబ్ పెచ్చులూడి పడుతుంటాయి. వర్షా కాలం వస్తే మరింత భయంగా ఉంది. ఒకే గదిలో చదువులు, నిద్రలు చేస్తున్నాం. చాలా ఇబ్బందిగా ఉంది.

– గంగిరి రమ్య, విద్యార్థిని

తాగునీటికీ.. కటకట



వసతి గృహంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్, చేతి పంపు రిపేర్లతో మూలకు చేరాయి. ట్యాంకు నుంచి వచ్చిన నీటితోనే దప్పిక తీర్చుకుంటున్నాం. దుస్తులు ఉతికేందుకూ ట్యాంకు నీరే దిక్కు. ఆర్వో ప్లాంటు పనిచేయక తాగునీటికి కటకటలాడుతున్నాం. చేతి పంపు లేక అవస్థలు పడుతున్నాం. వెంటనే వీటిని బాగుచేయాలి.

– కె.అపర్ణ, 9వ తరగతి

రన్నింగ్ వాటర్ లేదు



మరుగుదొడ్లకు అమర్చిన వాటర్ పైప్‌లైన్ మరమ్మతులకు గురైంది. బకెట్లతో నీరు పట్టుకెళ్లి కాలకృత్యాలు తీర్చుకుంటున్నాం. దీంతో నిర్దిష్ట సమయానికి పాఠశాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. వసతి గృహం వెనుక వైపు విద్యుత్ సదుపాయం లేక చీకటి పడితే విష జంతువులతో భయంగా ఉంది.

– రాజాన శ్రావ్య, 7వ తరగతి

రూ.50 లక్షలు మంజూరు

మెట్టపాలెం బీసీ బాలికల వసతిగృహ భవన నిర్మాణానికి సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం రూ.50 లక్షలు మంజూరు చేసింది. దీనికి సంబంధించి టెండర్లను కూడా ఆహ్వానించాం. శిథిలావస్థలో ఉన్న వసతి గృహాన్ని త్వరలో తొలగించి, ఆ స్థానంలో నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం.

– కె.ప్రకాశరావు, సీఎస్సార్ సీనియర్ మేనేజర్, ఎన్టీపీసీ

కూడళ్లలో విస్తృతంగా వాహన తనిఖీలు

- 27 మందిపై కేసుల నమోదు



వేపగుంట కూడలి వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ సతీష్‌కుమార్, సిబ్బంది

పెందుర్తి: పెందుర్తి, వేపగుంట కూడళ్ల వద్ద పెందుర్తి పోలీసులు మంగళవారం సాయంత్రం ఆకస్మిక వాహన తనిఖీలు చేపట్టారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో రెండు బృందాలుగా ఏర్పడిన పోలీసులు అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. హెల్మెట్, ఇతర రికార్డులు లేని 25 మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. మద్యం సేవించి పట్టుబడిన ఇద్దరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే రూ.10 వేలు జరిమానా విధిస్తామన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని సూచించారు. తనిఖీల్లో ఎస్‌ఐ అసిరితాత, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరంలో ఎస్సీ వర్గీకరణ విజయోత్సవాలు



మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలతో అభిషేకం చేస్తున్న మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి సభ్యులు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరం సాయినగర్ కాలనీలో నియోజకవర్గ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కన్వీనర్ ఇందుగుబిల్లి గోపి, మండల కన్వీనర్ బొర్రా జయరాజు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ విజయోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్గీకరణ విజయసారథి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సమితి మాజీ అధ్యక్షుడు గొటివాడ సామ్రాట్‌కుమార్ మాట్లాడుతూ మాదిగ జాతి 30 ఏళ్ల ఆకాంక్ష ఎట్టకేలకు నెరవేరిందన్నారు. ఎన్నో బాధలు, అవమానాలు దిగమింగి జాతి ఆశల్ని తీర్చిన పోరాట యోధుడు మందకృష్ణ మాదిగకు జాతి మొత్తం రుణపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు నీటిపల్లి ముత్యాలు, గొటివాడ సన్యాసి, దువ్వి దుర్గాలు, కొమ్ము కోటి, ఇందుగుబిల్లి పరదేశి, నీటపల్లి సోమేశ్వరరావు, దువ్వి మనోహర్, కణితి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ బోధన



అడ్మిషన్ల కోసం ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు

పెందుర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ బోధన, చక్కటి వసతులు ఉన్నాయని నరవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కప్పల ప్రసాద్ అన్నారు. జీవీఎంసీ 88వ వార్డులోని నరవ హైస్కూల్ పరిధిలో మంగళవారం అడ్మిషన్స్ డ్రైవ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. నరవ పాఠశాలలో పూర్తిస్థాయి సౌకర్యాలు ఉన్నాయన్నారు. విశేష బోధనానుభవం కలిగిన ఉపాధ్యాయులున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ జెర్రిపోతుల నాగేంద్ర, స్థానిక నాయకులు గల్లా శ్రీనివాసరావు, ఎల్లపు శ్రీనివాసరావు, బుదిరెడ్డి శివ, బాలు, గంతకోరు ధర్మరాజు, రాడి పెంటారావు, చందు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వుడా భూమిలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఏర్పాట్లు!

పెదగంట్యాడ: ప్రభుత్వ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు రంగం సిద్ధం చేశారు. దీంతో గాంధీనగర్ వాసులు మంగళవారం అడ్డుకున్నారు. జీవీఎంసీ 73వ వార్డు పరిధిలోని చిన నడుపూరులో నూకాంబిక ఆలయం వెనుక గెడ్డ ఉంది. దానికి ఆనుకొని జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని గాంధీనగర్ ప్రాంతం ఉంది. అక్కడ స్థలం ఖాళీ ఉండడంతో స్థానికులు కొంతమంది అక్కడ చిన్న చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు.. ఆయా దుకాణాల యజమానులు ఆలయ కమిటీకి ప్రతి నెలా అద్దె రూపంలో రూ.1000 నుంచి రూ.2వేల వరకూ చెల్లిస్తున్నారు.. ఆ అద్దె డబ్బులతోనే ఆలయాన్ని నిర్వహిస్తున్నారు.

అయితే ఇప్పుడు దుకాణాలను తొలగించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు సన్నాహాలు ప్రారంభించారు.దీనిపై సమాచారం అందుకున్న గాంధీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, గాంధీనగర్ వాసులతో కలసి అడ్డుకున్నారు. దీంతో అక్కడ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది..పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఇరువర్గాలతో చర్చలు జరిపారు. అది వుడాకు చెందిన స్థలమంటూ గాంధీనగర్ వాసులు చెబుతుండగా, అది గెడ్డ స్థలమని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ స్థలం విషయంలో వీఎంఆర్‌డీఏ , రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.



ఇరువర్గాల మధ్య ఘర్షణ

భక్తిశ్రద్ధలతో బొర్రమాంబ మారువారం

అగనంపూడి: అగనంపూడి పరిసర ఎనిమిది గ్రామాల ఆరాధ్య దైవం బొర్రమాంబ అమ్మవారి మారువారాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మొదటి వారం వివిధ కారణాల వల్ల పండగ చేయని వారు, ఎనిమిది గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి ముర్రాట సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పసుపు, కుంకుమ, గాజులు, చీర సారెలతో అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చిత్రా గణేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి.. ప్రసాదాలు అందించారు.



ప్రత్యేక అలంకరణలో బొర్రమాంబ, అమ్మవారికి పసుపునీటితో అభిషేకం చేస్తున్న భక్తులు

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



సతీష్‌కుమార్

పెందుర్తి: స్థానిక మహాలక్ష్మినగర్‌లో నివాసం ఉంటున్న అవుపాటి సతీష్‌కుమార్(25) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కాలనీలో నివాసం ఉంటున్న సతీష్ ఈ నెల 19న ఉదయం విధులకని బయలుదేరాడు. తండ్రి నాగేశ్వరరావు కుమారుడిని బైక్‌పై తీసుకెళ్లి, బస్టాప్ వద్ద దించాడు. సాయంత్రం తిరిగి ఇంటికి రాకపోవడంతో స్నేహితులు, బంధువులను ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో సతీష్ తండ్రి పోలీసులను ఆశ్రయించారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలి

పెదగంట్యాడ: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై అధికారులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి న్యాయం చేయాలని వినాయకనగర్ లివింగ్ క్రైస్ట్ చర్చి పాస్టర్లు కె.శాంసన్, ఆరోన్‌జాన్ సుజిత్ కోరారు. ఈ మేరకు మంగళవారం వినాయకనగర్, చినగంట్యాడ, నడుపూరు తదితర ప్రాంతాల్లో ఆయన మృతికి సంతాపంగా శాంతి ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి న్యాయం చేయాలని కోరారు. ఘటన జరిగి ఇన్ని రోజులు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. పాస్టర్ పగడాల ప్రవీణ్ మరణం క్రైస్తవులను మనోవేదనకు గురిచేసిందని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని ర్యాలీ నిర్వహించినట్లు పేర్కొన్నారు.

పైడిమాంబ.. చల్లగ చూడమ్మా



పైడితల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న నర్సింగరావు

పెదగంట్యాడ: కొత్త కర్ణవానిపాలెం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పసుపు కుంకుమలు, సారె చీరలతో మొక్కులు చెల్లించుకున్నారు.

బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో భాస్కర్, నాయుడు, వెంకటరావు, శ్రీను, రాజు, కనకరాజు, అనిల్, వికాస్, కుమార్, కార్తీక్, మహేష్, పెంటారావు, ప్రసాద్, వరహాలరావు పాల్గొన్నారు.

రేపు దుర్గమాంబ పండగ



దుర్గమాంబ పండగ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మాడుగుల ఎమ్మెల్యే బండారు, గ్రామ పెద్దలు

పరవాడ: మండలంలోని వెన్నలపాలెంలో గ్రామ దేవత దుర్గమాంబ పండగను ఈ నెల 24న ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ మేరకు అమ్మవారి పండగ గోడపత్రికను మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, గ్రామ పెద్దలు మంగళవారం ఆవిష్కరించారు. ఆ రోజు వేకువ జాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరపనున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు అవసరమైన సదుపాయాలు కల్పించనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. ఆ రోజు రాత్రికి గ్రామ పురవీధుల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెన్నల అప్పారావు, పైల సన్యాసిరావు, వెన్నల సన్యాసిరావు, పైల అప్పలనాయుడు, వెన్నల నరసింహారావు, మారునాయుడు, గిరి, అభినాయుడు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వసతి గృహ విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌ల పంపిణీ



స్కూల్ బ్యాగ్‌లు అందుకున్న విద్యార్థినులతో అసోసియేషన్ ప్రతినిధులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం సౌజన్యంతో సమకూర్చిన స్కూల్ బ్యాగులు, వాటర్ బాటిళ్లను సంస్థ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు గుంటూరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పరవాడ బాలికలు, బాలుర వసతి గృహ విద్యార్థులకు మంగళవారం అందించారు. అంబేడ్కర్ జయంతిన నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అసోసియేషన్ ప్రతినిధులు జి.సుధాకర్, కె.తాతబాబు, జె.చిట్టినాయుడు, ఎస్.ప్రసాద్, కె.మహేష్, జి.చినబ్బాయి, జె.ఆదియ్య, కె.కె.సింహాచలం, వసతి గృహాల వార్డెన్‌లు పాల్గొన్నారు.